
సాక్షి సిద్దిపేట

ఆదివారం । 5 । మార్చి । 2023



వరికి మొగి తెగులు

మొగి తెగులుతో యాసంగిలో వరి సాగు చేసిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. నివారణ చర్యలు చేపట్టినా ఫలితం లేదని ఆందోళన చెందుతున్నారు. 8లో..



టోల్ ప్లాజా సిబ్బంది దాడి

వాహనదారుడిపై టోల్ ప్లాజా సిబ్బంది దాడి చేశారు. ఈ సంఘటన దుద్దెడ శివారు రాజీవ్ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. 8లో..



ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని గడా ఓఎస్డీ ముత్యంరెడ్డి అధికారులకు సూచించారు. 9లో..

న్యూస్‌రీల్

'కంటి వెలుగు'పై మంత్రి వీడియో కాన్ఫరెన్స్



కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు

సిద్దిపేటరూరల్: మహిళా ఆరోగ్యం , సీపీఆర్ శిక్షణ, కంటి వెలుగు, వడ్డీలేని రుణాలు, తదితర అంశాలపై ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్ నుంచి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా స్కీంలకు సంబంధించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయాధికారి శివప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఏసీపీ దేవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో ఆర్జిత సేవల ధరల పెంపు





పెంచిన ధరల పట్టిక

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో పలు ఆర్జిత సేవలైన పట్నాలు, బోనాలు, తిరుగుడు కోడె, ప్రసాదం ధరలను పెంచుతూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆలయ అధికారులు శనివారం నుంచి ఆయా సేవల ధరలను పెంచారు. చెల్కపట్నం రూ. 80 నుంచి రూ.100, నజరు పట్నం రూ.100 నుంచి రూ.150, ముఖ మండప పట్నం రూ.200 నుంచి రూ.250, తిరుగుడు కోడెను రూ.150 నుంచి రూ.200, బోనం టికెట్ ధరను రూ.20 నుంచి రూ.30 , పులిహోర ప్రసాదం రూ.10 నుంచి రూ.20కి పెంచారు. ఈ ధరల పెంపుతో ఆలయానికి మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలుపారు. అలగే స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఏడో ఆదివారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

కోట మైసమ్మ రోడ్డు విస్తరణలో నిర్లక్ష్యం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న అసమ్మతి కౌన్సిలర్లు

గజ్వేల్: గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కోటమైసమ్మ రోడ్డు విస్తరణలో నిర్లక్ష్యం కొనసాగుతుందని, ఈ విషయంలో సంబంధిత అధికారులు, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి చొరవ చూపడం లేదని కలెక్టర్‌కు అసమ్మతి కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వివరించారు. విస్తరణ పనుల్లో జాప్యం వల్ల పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని, ఇళ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇవ్వడంలోనూ నిర్లక్ష్యం కొనసాగుతుందని తెలిపారు. జంక్షన్ల సుందరీకరణ పనులు కూడా ఆలస్యమవుతున్నాయని, ఈ పనులను ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో కౌన్సిలర్లు విద్యారాణి, బాలేష్, షహనాజ్, దుంబాల లక్ష్మి, కురాకుల శ్రీనివాస్, బాలమణి, గుంటుకు శీరీష, వరలక్ష్మి, చందన, శ్యామల, రజిత తదితరులు ఉన్నారు.

ప్రయోగాలు అద్భుతం



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్నకిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను డీఈఓ పరిశీలించి అభినందించారు. అలాగే సైన్స్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డిని ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ కనకయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, సంతోష, మహబూబ్‌పాషా, రహీం పాల్గొన్నారు.

మళ్లీ.. 'డబుల్' ఇళ్ల లొల్లి

- జాబితాలో చోటు దక్కని పేదల ఆవేదన
- మహిళ ఆత్మహత్యాయత్నంతో చర్చనీయాంశం
- మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లిన స్థానిక నేతలు
- రేపు నిర్వహించాల్సిన లక్కీ డ్రా వాయిదా
- గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పరిస్థితి



తుది జాబితాను పరిశీలిస్తున్న ప్రజలు



డబుల్ బెడ్రూం ఇళ్ల మోడల్ కాలనీ

గజ్వేల్: అధికారుల వైఫల్యం కారణంగా గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 'డబుల్' బెడ్ రూం ఇళ్ల లొల్లి మళ్లీ మొదటికొచ్చింది. తాజాగా శుక్రవారం తుది జాబితాను విడుదల చేసిన నేపథ్యంలో చోటు దక్కని పేదలు ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హులకే దక్కాయంటూ ఆరోపణలు వెల్లువెత్తడం, ఈ క్రమంలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో సమస్య తీవ్రతను పెంచింది. ఈ క్రమంలోనే ఈ అంశాన్ని స్థానిక నేతలు మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రేపు(6వ తేదీన) జరగాల్సిన లక్కీడ్రా వాయిదా పడింది.

తుది జాబితాపై దుమారం

సీఎం కేసీఆర్ గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి మొత్తం 1,250 ఇళ్లను మంజూరు చేశారు. ఈ 'మోడల్ కాలనీ'లో ఒక్కో ఇల్లు 570 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మాణం జరిగింది. 156 బ్లాకులుగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో బ్లాకులో కింద నాలుగు, పైన నాలుగు(మొత్తం 8 ఇళ్లు) రెండు ఫ్లోర్లుగా నిర్మించారు. ఈ క్రమంలో లబ్ధిదారుల ఎంపికకు 2021 మే 13 నుంచి 20 వరకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టిన సంగతి కూడా తెలిసిందే. మొత్తంగా 4,106 దరఖాస్తులను ప్రజలు అందించగా.. అందులో 3,518 మందిని పరిగణనలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. అనంతరం గత నెల ఫిబ్రవరి 3న 1,118 మందితో ప్రాథమిక జాబితాను విడుదల చేశారు. దీనిపై అభ్యంతరాలు వెల్లువెత్తాయి. జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని సుమారుగా 720కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. తమకు అన్ని రకాల అర్హత ఉన్నాయని కూడా కొందరు దరఖాస్తు చేసుకోగా వీటన్నంటినీ పరిశీలించి తాజాగా శుక్రవారం 1,389 మందితో తుది జాబితాను విడుదల చేశారు. ప్రస్తుతం డబుల్ బెడ్ రూమ్ మోడల్ కాలనీలో ఉన్న ఇళ్ల కంటే లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉండటంతో ఈనెల 6న పట్టణంలోని మహతి ఆడిటోరియంలో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. కానీ ఈ జాబితాపై కూడా దుమారం రేగింది. చోటు దక్కని పట్టణానికి మంజుల అనే మహిళ ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది.

అధికారుల తప్పిదం వల్లే..

డబుల్ ఇళ్ల వ్యవహారం వివాదస్పదం కావడానికి అధికారుల తప్పిదమే కారణమని స్పష్టమవుతోంది. లబ్ధిదారుల ఎంపిక సందర్భంలో అధికారులు వాడిన సాఫ్ట్‌వేర్ లోపాల కారణంగా అనర్హులకు ఇళ్లు దక్కాయని తెలుస్తోంది. నిజానికి లబ్ధిదారుల పేరిట వేరే ఇతర ఆస్తులు, ఇళ్లు, ఖరీదైన వాహనాలు ఉంటే ఈ పథకానికి పరిస్థితుల్లో అర్హులు కారు. సాఫ్ట్‌వేర్ లోపాల వల్ల ఇవన్నీ ఉన్నా ఎంతో మంది పేర్లు జాబితాలో కనిపించడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ఈ అంశాలను శనివారం రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి శాస్త్రీయ పరిష్కారం చూపాలని కూడా కోరారు. దీంతో మంత్రి అక్కడి నుంచి కలెక్టర్‌కు ఆదేశాలివ్వడంతో లబ్ధిదారుల ఎంపిక కోసం జరగాల్సిన లక్కీ డ్రా వాయిదా పడింది. ఈ సమస్యకు ఎలాంటి శాస్త్రీయ పరిష్కారం ఉండబోతుంది? ప్రస్తుతం పంపిణీ చేయాల్సిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లల్లో నివాసముంటున్న మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి వారిని ఎప్పుడు ఖాళీ చేయిస్తారు? అనే అంశాలపై ఎదురుచూపులు తప్పేలా లేవు.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 41 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 22,622 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పోలీస్ అధికారులు ప్రశ్నాపత్రాలను స్టేషన్లో స్టోర్ చేయడం, పరీక్ష కేంద్రాలకు తరలించడం, కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం తదితర బందోబస్తు చూడాలన్నారు. ఆర్టీసి అధికారులు సమయానికి పరీక్ష కేంద్రాలకు బస్సులు నడపాలన్నారు. అన్ని శాఖల అధికారులకు సమన్వయంతో ప్రశాంతంగా పరీక్ష రాయడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాశ్, ఏసీపీ దేవారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్, కలెక్టరేట్ ఏఓ రెహమాన్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, డీఎం, పోస్టల్, విద్యుత్, విద్యా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా పీఆర్టీయూ



ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా పీఆర్టీయూ మాత్రమే నిలుస్తుందని ఆ సంఘం గౌరవ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో తమ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్స్ స్లిప్పులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా సీరియల్ నెంబర్ 11 వద్ద మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం వెంకటరాజం, సిద్దిపేట అర్బన్ మండల శాఖ అధ్యక్షులు కత్తుల బాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బెంజరం నరసింహారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ గన్నె రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వెద సాగుతో అధిక లాభాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వెదసాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని తిగుల్‌లో వెద పద్ధతిలో సాగు చేసిన రైతు దయానంద్‌రెడ్డి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పద్ధతిలో సాగుతో పెట్టుబడి తగ్గి, రాబడి పెరుగుతుందన్నారు. అలాగే వేరుశనగలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఏఈఓ శరణ్య రైతులు పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని శివప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రాయితీ అవకాశం కలిస్తుందన్నారు. మండలంలో 480 ఎకరాల్లో ఈ పంట సాగు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దుబ్బాక ఆస్పత్రిలో డయాలసిస్

- ఐదు పడకలతో సెంటర్ ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు
- కిడ్నీ రోగులకు సకాలంలో అందనున్న వైద్యం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు





దుబ్బాక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్

దుబ్బాకటౌన్: కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలందిస్తున్న దుబ్బాక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో నేటి నుంచి డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి రానుంది. ఏడాదిన్నర క్రితమే అన్ని హంగులతో ఈ ఆస్పత్రి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటికే ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలు అందుతుండగా ఇప్పుడు కొత్తగా కిడ్నీ వ్యాధి బాధితులకు చికిత్స అందించేలా ఐదు పడకలతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని నేడు వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగ ప్రారంభించనున్నారు.

తొలగనున్న బాధలు

దుబ్బాక పట్టణంలో 100 పడకల ఆస్పత్రి అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతంలోని ప్రజలకే కాకుండా పక్కనే ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లోని చాలా గ్రామాలు, కామారెడ్డి జిల్లా బీబీపేట, దోమకొండ మండలాల్లోని పలు గ్రామాలు, మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని ప్రజలు ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. ఇప్పుడు ఇక్కడ డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి వస్తుండడంతో కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులు సిద్దిపేట, హైదరాబాద్ వెళ్లే బాధలు తప్పనున్నాయి. ఈసెంటర్‌ను నేడు(5వ తేదీ) వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారు. దీంతో పాటు పట్టణంలోని బల్వంతాపూర్ రోడ్డులో డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిర్మించిన బస్తీ దవఖానను సైతం ప్రారంభించనున్నారు. మంత్రితో పాటుగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో పాటు వైద్య,ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు.

ఇక్కడే అన్ని రకాల వైద్య సేవలు



దుబ్బాక ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి వస్తుండడం చాలా సంతోషకరం. ఇప్పటికే ఐదు పడకలకు సంబంధించి అన్ని ఎక్విప్‌మెంట్, పరికరాలను సిద్ధం చేశాం. ఈ సెంటర్‌ను నేడు మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారు. దీంతో కిడ్నీ రోగులు సిద్దిపేట, హైదరాబాద్‌కు వెళ్లకుండా ఇక్కడే వైద్య సేవలు పొందవచ్చు.

– డాక్టర్ హేమరాజ్‌సింగ్, ఆస్పత్రి సూపరింటిండెంట్



అధికారులతో మాట్లాతున్న కలెక్టర్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

మహిళా దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8న సిద్దిపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళా దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 3,000 మంది వివిధ రంగాలకు చెందిన మహిళలతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్టేజ్, సౌండ్ సిస్టమ్, షామియానా, తాగు నీరు, మహిళా సంబంధ స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత వస్త్ర ప్రదర్శనను పరిశీలించారు. మహిళ దినోత్సవం వరకు ఈ ప్రదర్శనను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ గోపాల్‌రావు, డీపీవో దేవకీదేవి, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్, మంత్రి హరీశ్‌రావు ఓఎస్డీ బాలరాజు, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు పాల సాయిరాం, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్స్‌తో భరోసా, భద్రత

పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



సిద్దిపేటకమాన్: షీ టీమ్స్ విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ డివిజన్ల వారిగా షీటీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్లలో ఫిబ్రవరిలో 32 హాట్‌స్పాట్లను 649 దఫాలు షీటీమ్ సిబ్బంది సందర్శించడం జరిగిందన్నారు. ఈవ్‌టీజర్స్‌ను పట్టుకుని 27 మందికి కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, షీటీమ్ వాట్సప్ నంబర్ 7901640473, సిద్దిపేట పోలీసు కంట్రోల్ రూమ్ 83339 98699 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా ఆధ్వర్యంలో షీటీమ్స్ బృందాలు పనిచేయడం జరుగుతుందన్నారు. అలాగే భరోసా సెంటర్‌లో ఇప్పటివరకు 120 మంది బాధితులకు భరోసా కల్పించి అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. స్నేహిత మహిళా సపోర్టు సెంటర్‌లో ఇప్పటివరకు 154 దరఖాస్తులు రాగా 115 దరఖాస్తులు పరిష్కరించినట్లు సీపీ వివరించారు. షీటీమ్స్‌లో ఎస్ఐ సాంబయ్య, సిబ్బంది అమృత్, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, మహిళ కానిస్టేబుల్స్ పద్మ, సంగీత, జ్యోతి, రజిత, కానిస్టేబుళ్లు స్వామి, ప్రకాశ్, రవి, యుగేందర్, అన్వేష్, సిబ్బంది డివిజన్ల వారీగా విధులు నిర్వహిస్తున్నారు.

6వ తేదీన తుది పోటీలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాలబాలికలకు నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా తుది పోటీలను 6వ తేదీన పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సీపీ శ్వేత శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండల కేంద్రాల్లో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన తుది పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతికి రూ.5వేలు, రెండో బహుమతికి రూ.3వేలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే 8న ఉదయం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద 5కే రన్ పోటీలు ప్రారంభమవుతుందన్నారు. ఇందులో మొదటి బహుమతికి రూ.10వేలు, రెండో బహుమతికి రూ.7,500, మూడో బహుమతికి రూ.5వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వరకు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ (టీఎస్‌పీఈ) జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కొనసాగిస్తామని చైర్మన్ వీరభద్రయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఎదుట విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ గంగాధర్, ఇంజనీర్స్, అకౌంట్ స్టాఫ్, ఓఅండ్ఎం ఉద్యోగులు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, పాండరీ, బాలకిషన్, చంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కుతుబ్‌ఉద్దిన్, లిమేశ్, రాంమోహన్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు .

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆదర్శ పాఠశాలల్లో 6, 7, 8, 9, 10 తరగతిల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి 8 వరకు దరఖాస్తుల గడువును పెంచారన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు దగ్గరిలోని ఆదర్శ పాఠశాలను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు


గాయపడిన సుధాకర్

ఝరాసంగం(జహీరాబాద్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నాడు. శనివారం బోరెగాం గ్రామ పరిధిలోని ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మత్తుకు ఎల్‌సీ తీసుకుని చేస్తున్నాడు. పైన ఉన్న మరో విద్యుత్తు లైన్‌కు ఎల్‌సీ తీసుకోకపోవటంతో విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): అతి వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి పడిపోవడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోలస్వామి చేర్యాల మండలం గురిజకుంట వాగు వద్ద సోదరుల పెళ్లికి హాజరై తిరుగు ప్రయాణమయ్యాడు. వేగంగా వెళ్తుండగా మండలంలోని కిష్టంపేట గ్రామం వద్ద అదుపుతప్పి పడిపోవడంతో కోల స్వామికి తీవ్రగాయలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో, వారు వచ్చి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అధైర్య పడకండి అండగా ఉంటా

దుబ్బాక: అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన రెండు కుటుంబాలకు అండగా ఉంటానని ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి అన్నారు. దౌల్తాబాద్ మండలం లింగాయపల్లి తండాలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి రెండు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. శనివారం మామిడి మోహన్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

వరికి మొగి తెగులు

- నివారణ చర్యలు శూన్యం
- 800 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట
- అయోమయంలో రైతులు
- నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు


సిర్సనగండ్లలో మొగి పురుగు ఆశించిన వరి చేను

కొండపాక(గజ్వేల్): యాసంగిలో వరి సాగు చేసిన రైతుల ఆశలు మొగి పురుగు తెగులుతో అడియాశలయ్యాయి. మొగి పురుగు తెగులు నివారణకు చర్యలు తీసుకున్నా ఫలితం లేకపోవడంతో, సాగు కోసం పెట్టిన పెట్టుబడులు రావని భయాందోళన చెందుతున్నారు.

- కొండపాక, కుకునూరుపల్లి మండలాల సరిహద్దులో మల్లన్న సాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్లు ఉండటంతో భూగర్భజలాలు సమృద్ధిగా ఉన్నాయి.
- కోతుల బెడద కారణంగా ఆరుతడి పంటలు సాగు చేసుకోలేక వరి సాగుపైనే ఆధారపడ్డారు.
- ఈసారి 23 వేల ఎకరాల్లో వరి పంట సాగును చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.
- వరి పంట సాగు ప్రారంభ దశ నుంచే పంటకు మొగి తెగులు ఆశించడంతో చేనంతా ఎర్రబారి కుళ్లి పోవడం ప్రారంభమైంది.
- నివారణ కోసం వ్యవసాయాధికారులు, ఎరువుల దుకాణాదారుల సలహాలు, సూచనలు పాటించినా ఫలితం లేకుండా పోయిందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సుమారు 800 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు.
- ముఖ్యంగా సిర్సనగండ్ల, మర్పడ్గ, బందారం, తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, జప్తినాచారం, వెలికట్ట, కుకునూరుపల్లి, మేదినీపూర్, మంగోల్, బొబ్బాయిపల్లి, అంకిరెడ్డిపల్లి, లకుడారం గ్రామాల్లో వరి పంట మొగి పురుగు తెగులుతో ఎక్కువ శాతం నష్టపోయినట్లు రైతులు పేర్కొన్నారు.
- వరి పంట ఏపుగా వచ్చేందుకు బలమైన కార్తెల్లో నాటు వేసుకోవాలన్న రైతుల ఆశలు మొగి పురుగు తెగులు ఆడియాశలు చేశాయి.
- మొగి పురుగు నివారణ కోసం చేపట్టిన చర్యలు ఫలించక పోవడంతో కొన్ని గ్రామాల్లో పంట చేనును ట్రాక్టరుతో దున్నేయగా, మరికొన్ని గ్రామాల్లో పశువులను వదిలి విడిచిపెట్టారు.
- యాసంగి మొదటి కార్తెలో నాటు వేసిన వరి పంటకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండగా, సంక్రాంతి పండగ తరువాత నాటువేసిన వరికి తెగుళ్ల బెడద తక్కువగా ఉందన్నారు.
- వ్యవసాయ కూలీల కొరత అధిగమించి నాటు వేయగా తెగుళ్ల బెడద తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు.
- సాధారణంగా ఎకరా పొలం నాటు వేసేందుకు రూ.20 వేల పెట్టుబడి పెట్టాల్సి ఉండగా కూలీల ధరలు, మొగి పురుగు తెగుళ్ల కోసం నివారణ మందుల వాడకంతో రూ.30 వేల వరకు పెట్టుబడి అయ్యిందన్నారు.
- ప్రభుత్వం స్పందించి వరి పంటకు సోకిన మొగి పురుగు తెగుళ్లను ప్రకృతి విపత్తుల కోటాలో నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.
- ఈ విషయమై మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిణిని వివరణ కోరగా ఈసారి వరి పంటకు సోకిన మొగి పురుగు నివారణకు పొలాల్లో లింగాకర్షక బుట్టలు అమర్చుతూ వాటి ఉధృతిని అరికట్టాం. అయినా అక్కడక్కడ పంట దెబ్బతింది. రైతుల విజ్ఞప్తి మేరకు పంట నష్టంపై అధికారులకు వివరిస్తాం.

పశువులకు వదిలివేశాం



బోరుబావి నీటి ఆధారంగా నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాం. నాటు వేయగానే రెండు ఎకరాల్లో మొగి పురుగు సోకడంతో చేనంతా ఎర్రబారి కుళ్లిపోయింది. నివారణ చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో పశువులకు వదిలి వేశాం.

– చింతల శ్రీనివాస్‌గౌడ్, రైతు, జప్తినాచారం

నష్ట పరిహారం అందించాలి



మా ఊరు మల్లన్న సాగర్ నిర్మాణంలో మునిగిపోవడంతో ఎనిమిది ఎకరాల భూమిని కోల్పోయాం. ప్రభుత్వం ఇచ్చిన అరకొర పరిహారంతో మేదినీపూర్‌లో మూడు ఎకరాల భూమిని కొనుగోలు చేసి వరి పంటను వేశాం. మొగి పురుగు తెగుళ్లతో పంటంతా దెబ్బతింది. నష్టపరిహారం అందించాలి.

– మన్నెం కిష్టారెడ్డి, రైతు, ఎర్రవల్లి

పెట్టుబడి అప్పులు మీద పడ్డాయి



ఏటా యాసంగిలో బలమైన కార్తెలో మూడు ఎకరాల్లో, తరువాత కార్తెలో మరో మూడు ఎకరాల్లో నాటు వేశాం. ముందు వేసిన వరి పంటకు మొగి పురుగు తెగులు సోకడంతో చేనంతా పాడైంది. ఎన్ని రకాల మందులు వాడినా ఫలితం లేకుండా పోవడంతో వదిలేశాం. పెట్టుబడి కోసం చేసిన అప్పులు మీదపడ్డాయి.

– పెరుగు అంజయ్య, రైతు, వెలికట్ట

హత్యకేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ తోట భూపతి

కోహీర్(జహీరాబాద్): హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా కోర్టు వారికి రిమాండ్ విధించిందని జహీరాబాద్ సీఐ తోట భూపతి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2021 సెప్టెంబర్ 3వ తేదీన కోహీర్ పట్టణ శివారులోని మాచిరెడ్డిపల్లి రహదారి పక్కన సోయాబీన్ పొలంలో హత్యకు గురైన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం శిరిపురం గ్రామస్తుడు ఇర్మ నారాయణ హత్యకేసు ఛేదించామన్నారు. కోహీర్ మండలం మనియార్‌పల్లి గ్రామస్తుడు గంజాయి రాజు, నారాయణ రెండో భార్య ఇర్మ సుజాత కలిసి హత్య చేశారు. సుజాత తల్లి స్వగ్రామం బంటారం మండలం తోరుమామిడి గ్రామం. సుజాత అక్రమ సంబంధంపై భర్త నారాయణ నిత్యం వేధిస్తుండటంతో అతడి అడ్డు తొలగించుకోవడానికి పథకం వేసి ప్రకారం హత్య చేశారు. ముగ్గురూ మద్యం తాగిన అనంతరం మాచిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డు పక్క ఉన్న పొలంలో భర్త నారాయణ తలపై బండరాయితో మోదీ హత్య చేశారు. మృతుడు నారాయణ అన్న వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

వాహనదారుడిపై టోల్ ప్లాజా సిబ్బంది దాడి


దాడి చేస్తున్న టోల్ ప్లాజా సిబ్బంది

కొండపాక(గజ్వేల్): వాహనదారుడిపై టోల్ ప్లాజా సిబ్బంది దాడి చేశారు. ఈ సంఘటన మండలంలోని దుద్దెడ గ్రామ శివారు రాజీవ్ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణం నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి నలుగురు వ్యక్తులు కారులో వెలుతున్నారు. ఆసుపత్రికి వెళ్లే హడావుడిలో వాహనం టోల్ ప్లాజా పాస్‌కార్డు ఇంటిలో మర్చిపోయారు. టోల్ ప్లాజా 1వ నంబరు టోల్ నుంచి వెళ్లే క్రమంలో సిబ్బంది వాహనాన్ని ఆపారు. పాస్ ఉంటే చూపాలి లేదంటే రుసుం చెల్లించాలంటూ సిబ్బంది చెప్పారు. అక్తార్ పటేల్ బంధువులమంటూ వాహనదారులు సిబ్బందికి చెప్పారు. ఆసుపత్రికి వెళ్లే హడావుడిలో పాస్ ఇంటిలో మర్చిపోయామంటూ వాహనదారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇలా వాగ్వాదం జరుగుతుండటంతో వెనుక మరిన్ని వాహనాలు ఆగిపోయాయి. రుసుం చెల్లిస్తేనే టోల్ నుంచి వాహనాన్ని వదులుతామంటూ సిబ్బంది తెగేసి చెప్పారు. దీంతో వారి మధ్య మాటామాట పెరిగి తోపులాటకు దారి తీసింది. టోల్‌ప్లాజా సిబ్బంది ఒక్కసారిగా దాడికి దిగారు. టోల్ రుసుం చెల్లించినప్పటికీ సిబ్బంది దాడికి పాల్పడటం దారుణమన్నారు. టోల్‌ప్లాజా సిబ్బందిపై ప్రయాణికులు, ఇతర వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై టోల్‌ప్లాజా మేనేజర్ అశోక్‌రెడ్డిని సంప్రదించగా వాహనదారులపై సిబ్బంది వ్యవహరించిన తీరు విచారకరమన్నారు. సిబ్బందిని మందలించి వాహనదారులకు క్షమాపణ చెప్పించామని, మరోమారు ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాని చెప్పారు.

యువకుడి అదృశ్యం


నిఖిల్ వర్మ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: కూకట్‌పల్లి వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శనివారం పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ రాఘవేంద్రకాలనీకి చెందిన బాలకృష్ణ చిన్న కుమారుడు నిఖిల్ వర్మ శుక్రవారం మధ్యాహ్నం పటాన్‌చెరు నుంచి కూకట్‌పల్లి వెళ్లొస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి సాయంత్రం కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా రాత్రి 10 గంటలకు వస్తానని చెప్పాడు. మళ్లీ ఫోన్ చేస్తే ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో తండ్రి బాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం

గ్యాస్ సిలిండర్ లీకేజీతో మంటలు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండల పరిధి నారాయణపూర్ గ్రామ సమీప గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో అగ్నిప్రమాదం సంభవించింది. గ్యాస్ లీకేజీతో మంటలు రేగాయి. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం పాఠశాలలో ఉదయం సిబ్బంది వంటలు వండుతున్న క్రమంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. దీంతో మంటలను ఆర్పేందుకు సిబ్బంది, ఉపాధ్యాయులు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు రావడంతో విద్యార్థులు భయాందోళన గురయ్యారు. అందరూ సురక్షితంగా ఉండటంతో ఊపిరిపీల్చుకున్నారు.

విద్యుత్ వైరు చోరీకి యత్నం

వట్‌పల్లి(అందోల్): విద్యుత్ కేబుల్ వైరు చోరీకి కొందరు యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మండల పరిధిలోని ఖాదిరాబాద్‌లో నీటిని సరఫరా చేసేందుకు నిర్మించిన ఇంటెక్ వెల్ ఏర్పాటు చేశారు. దీని మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే కేబుల్ వైరు ఉంచారు. దానిని ఎత్తుకెళ్లేందుకు శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన కొందరు చోరీకి యత్నించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కొందరు వారిని ప్రశ్నించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. చోరీని అడ్డుకున్నవారు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. శనివారం పోలీసులు, మిషన్ భగీరథ ఏఈ రవికుమార్‌కు చోరీ విషయం తెలిపారు. ఈ విషయంపై ఏఈని వివరణ కోరగా చోరీకి యత్నించిన విషయం తెలిసిందన్నారు. ఏజెన్సీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. చోరీపై తమకు ఫిర్యాదు అందలేద ఎస్ఐ అంబర్యా తెలిపారు.

బైక్ రిజిస్ట్రేషన్ చేసుకొని తిరిగి వస్తూ..

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మాసాయిపేట మండలం రామంతాపూర్ శివారు 44వ జాతీ రహదారిపై శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన అర్కెల సంపత్ తన తల్లి అర్కెల మంజులతో కలిసి బైక్ రిజిస్ట్రేషన్ కోసం మెదక్ వెళ్లారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా ముందు వెళుతున్న వాటర్ ట్యాంకర్ ఒక్కసారిగా ఎడమవైపుకు తిప్పడంతో బైకు ఢీకొంది. దీంతో సంపత్, మంజుల కిందపడ్డారు. వెంటనే వారిని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మంజుల మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

అనుమతులు లేని నిర్మాణాల తొలగింపు


మిర్జాపూర్(బి)లో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను తొలగించిన దృశ్యం

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను అధికారులు తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మిర్జాపూర్(బి)లో గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా వెంచర్‌లో చేపట్టిన నిర్మాణాలను శనివారం అధికారులు తొలగించారు. గ్రామసమీపంలో సర్వే నంబర్ 8/ఏ/ఏఏ,8/ఏ/1,8/ఎ/4 లో వెంచర్ వేశారు. అయితే పంచాయతీ అనుమతులు తీసుకోకుండా అందులో నిర్మాణం చేపట్టారని సర్పంచ్ అధికారులకు ఫిర్యాదు చేసింది. వారు స్పందించకపోవడంతో జిల్లా అధికారులను ఫిర్యాదు చేసింది. దీంతో మండల పంచాయతీ అధికారి సురేశ్, పంచాయతీ కార్యదర్శి గాయత్రి వెంచర్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. శనివారం ఉదయం గ్రామానికి చేరుకున్న అధికారులు వెంచర్‌లో చేపట్టిన నిర్మాణాలను జేసీబీతో తొలగించారు. నిర్వాహకులకు అధికారులు, సర్పంచ్ నిర్మల జగన్నాథ్‌రెడ్డి మధ్య కొద్దిసేపు వాగ్వావాదం జరిగింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు వేసి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.


వాట్సాప్‌కు బ్లూ లింక్

- క్లిక్ చేయడంతో నగ్నంగా ఆన్‌లైన్‌లోకి మహిళ
- డబ్బులు పంపాలని లేదా వీడియో షేర్ చేస్తానని బెదిరింపు
- భయంతో రూ.11 వేలు పంపిన బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఫోన్‌కు వచ్చిన బ్లూ లింక్‌ను ఓ వ్యక్తి క్లిక్ చేశాడు. నగ్నంగా ఆన్‌లైన్‌లోకి వచ్చిన మహిళ అతడిని బ్లాక్‌మెయిల్ చేసింది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణానికి చెందిన ఫణికుమార్ వాట్సాప్‌కు ఓ లింక్ వచ్చింది. దాని క్లిక్ చేయడంతో వెంటనే ఓ మహిళ నగ్నంగా కనిపించింది. దీంతో అతడు అవాక్కయి వెంటనే వాట్సప్ క్లోజ్ చేశాడు. అనంతరం సంజిత్ కుమార్ కాల్ చేసి నీవు నగ్నంగా చూసింది రికార్డు చేశానని, అది సోషల్ మీడియాలో పోస్ట్ చేయకుండా ఉండాలంటే తనకు రూ.15 వేలు ఇవ్వాలని, అప్పుడు వీడియో తొలగిస్తానని చెప్పాడు. దీంతో భయపడి రూ.6 వేలు చెల్లించాడు. అయినా వీడియో తొలగించకుండా, ఇంకా డబ్బులు కావాలంటే మరో రూ.5 వేలు చెల్లించాడు. మళ్లీ బ్లాక్‌మెయిల్ చేయడంతో చేసేది లేక వాట్సాఫ్‌లో ఉన్న లింక్ సమాచారాన్ని తొలగించి, పటాన్‌చెరు పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యకేసు డీఎన్ఏ రిపోర్ట్ విడుదల

- మృతుడు శివకుమార్ అని తెలిపిన పోలీసులు
- కూతురిని ప్రేమించాడని యువకుడి హత్య
- మృతదేహాన్ని కాలువలో పడేసిన నిందితులు


శివకుమార్(ఫైల్)

పటాన్‌చెరుటౌన్: తన కూతురుని ప్రేమించాడని యువకుడిని హత్యచేసి కాలువలో పడేసిన ఘటనలో డీఎన్ఏ రిపోర్ట్‌లో వివరాలు తెలిశాయి. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు గ్రామానికి చెందిన శివకుమార్ పటాన్‌చెరు శివారు గుడిసెలో ఉంటున్నాడు. తన కూతురుని ప్రేమిస్తున్నాడని కూతురితో ఫోన్ చేయించి అతడిని 2022 అక్టోబర్ 7 తేదీన పిలిపించి యువతి తండ్రి, బాబాయ్ కలిసి హత్య చేశారు. మృతదేహాన్ని మూసీ నదికి వెళ్లే కాలువలో పడేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఘటన జరిగిన వారం తర్వాత భువనగిరి జిల్లా మలిగొండ వద్ద గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న ఓ మృతదేహం లభించడంతో ఆ మృతదేహం శివకుమార్‌దే అన్న అనుమానంతో డీఎన్ఏ పరీక్షకు పంపారు. ఆ మృతదేహం శివకుమార్‌దే అని నివేదిక రావడంతో మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు తెలిపారు.

సీపీఎస్‌ను సర్కార్ రద్దు చేయాలి

సీపీఎస్ ఎంప్లాయీస్ రాష్ట్ర సహ అధ్యక్షుడు కర్రోల్ల దేవయ్య

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేసి ఆదర్శంగా నిలవాలని సీపీఎస్ ఎంప్లాయీస్ రాష్ట్ర సహ అధ్యక్షుడు కర్రోల్ల దేవయ్య డిమాండ్ చేశారు. శనివారం చిన్నశంకరంపేటలో సీపీఎస్ ఎంప్లాయీస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉద్యోగం చేసినప్పటికీ ఉద్యోగ విరమణ తరువాత ఆసరా పెన్షన్ కన్నా అధ్వానంగా పెన్షన్ వస్తోందన్నారు. ఉద్యోగుల ఆందోళనను ప్రభుత్వం గ్రహించి వెంటనే వారికి అన్యాయం జరుగుతున్న సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, రియాజ్, నాగరాజు, వాణి, రమ పాల్గొన్నారు.

సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడుగా బి.ఎల్లం

సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ మెదక్ జిల్లా అధ్యక్షులుగా బి.ఎల్లం, ప్రధాన కార్యదర్శిగా చరణ్‌సింగ్, ఉపాధ్యక్షులుగా జి.సునీత, డి.సత్యానారాయణ, కార్యదర్శిగా ఏఈఓ శ్రీనివాస్, వాణి, కోశాధికారిగా ఎం.చంద్రం ఎన్నికయ్యారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు కళాశాలల యాజమాన్యాలే కారణం

ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు వేణు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేందుకు కళాశాలల యాజమాన్యాలే కారణమని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఆత్మహత్యలకు చిరునామాగా కార్పొరేట్ విద్యాసంస్థలు మారాయన్నారు. మార్కుల పేరుతో వారిపై ఒత్తిడి చెయ్యడాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న యాజమాన్యాల పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల వ్యక్తిగత కారణాలతో నలుగురు బలవన్మరణం చెందారు. కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి, అనారోగ్యంతో ఇద్దరు, చదువుకోమని వేధిస్తున్నారని యువతి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో వారు కేసులు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.


నర్సింలు మృతదేహం

దుబ్బాక: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో శనివారం జరిగింది. రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన చెట్టే నర్సింహులు (40) కూలి పనులు చేస్తున్నాడు. మండల పరిధిలోని రాంసాగర్ గ్రామానికి చెందిన పద్మతో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. తొమ్మిది నెలల క్రితం భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో పిల్లలను తీసుకొని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో నర్సింలు తరచూ మనోవేదనకు గురయ్యేవాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక..


పోచమ్మ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): కడుపు నొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం కౌడిపల్లి ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాజిపేట గ్రామానికి చెందిన మాసని పోచమ్మ(60)కు మూడేళ్ల క్రితం కడుపులో కేన్సర్ రావడంతో శస్త్రచికిత్స చేయించారు. మళ్లీ కడుపునొప్పితో కొంతకాలంగా బాధపడుతోంది. శుక్రవారం సాయంత్రం కడుపునొప్పి రావడంతో పురుగుల మందు తాగింది. విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంటంతో మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. మృతుడి కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో..


అఖిల్ (ఫైల్)

దుబ్బాకరూరల్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని హసన్‌మీరాపూర్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జాలిగామ కవిత, బాబు దంపతుల మొదటి కుమారుడు అఖిల్(19) సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కంపౌండర్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి భరించలేక శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకున్నాడు. శనివారం మృతుడి తండ్రి బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు అఖిల్ కుటుంబాన్ని ఎమ్మెల్యే రఘునందన్‌రావు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

చదువుకోమని వేధించారని..

జిన్నారం(పటాన్‌చెరు): ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుంది. ఈ సంఘటన జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో జరిగింది. శనివారం సీఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డిజిల్లా జిల్లా తాండూర్‌కు చెందిన ముత్తుపల్లి, విజయ దంపతులు బొల్లారం మున్సిపల్ పరిధిలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అక్షయ(18) కూకట్‌పల్లిలోని ఓ కళాశాలలో ఇంటర సెకండ్ ఇయర్ చదువుతోంది. చదువుపై ఇష్టం లేకపోవటంతో రెండు నెలలుగా కళాశాలకు వెళ్లడం లేదు. కళాశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు నిత్యం ఒత్తడి చేస్తుండటంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. మృతురాలి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు.

సైబర్ నేరం జరిగితే 1930కు కాల్‌చేయండి

ఎస్ఐ మహేందర్

దుబ్బాకటౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌చేయాలని ఎస్ఐ మహేందర్ అన్నారు. శనివారం దుబ్బాక ప్రభుత్వ హైస్కూల్‌లో బ్యాంకింగ్, ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయో వాటి గురించి వివరించారు. అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దన్నారు. ఆర్థిక అక్షరాస్యత సలహాదారులు లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కె.దయాకర్ మూఢనమ్మకాలపై తన మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం గాజుల రాంచంద్రం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.